క్లుప్తంగా

వర్షం నీటితో ఇబ్బంది


వర్షపు నీటిని దాటేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

కదిరి అర్బన్: కేఎస్ పాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలకు వెళ్లే దారిలో వంక పారుతోంది. దీంతో వంకను దాటి పాఠశాలలోకి వెళ్లాల్సి ఉంది. అక్కడ కల్వర్టు ఏర్పాటు చేస్తే వర్షపు నీటి సమస్య ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

పేదలకు అన్నదానం

ధర్మవరం అర్బన్: సీనియర్ న్యాయవాది గుంటిప్ప తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బుధవారం పట్టణంలోని తిక్కనారాయణస్వామి ఆలయంలో పేదలు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదిని ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు అభినందించారు.

సింగిల్ విండో చైర్మన్ బాధ్యతల స్వీకరణ


సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు

ఎన్పీకుంట: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సింగిల్‌విండో) చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈఓ బాబాఫక్రుద్దీన్ అధ్యక్షతన చైర్పర్సన్ చంద్రశేఖర్‌నాయుడుతో పాటు డైరెక్టర్లు లక్ష్మీనాయక్, మల్లారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ తరపున రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన చైర్మన్ తెలిపారు.

వైభవంగా ఖాద్రీశుని కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుని కల్యాణోత్సవం వైభవంగా సాగింది. అర్చకులు స్వామి వారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు పార్థసారథిస్వామి హోమాలు చేసి వేదమంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతులతో ఖాద్రీశునికి కల్యాణోత్సవం జరిపించారు.

సబ్సిడీపై కిసాన్ డ్రోన్ పంపిణీ


డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: అన్నదాత రైతు సేవా సంఘం ఫామ్ మిషనరీ బ్యాంక్ గ్రూప్‌కు కిసాన్ డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా, స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్, కంపెనీ ప్రతినిధి రవి, మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు రసాయనాల విష ప్రభావం, కూలీల ఖర్చు తగ్గించవచ్చని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ పూర్తి ఖరీదు రూ.9,80,000 కాగా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ మొత్తం రూ.7,84,000, రైతు గ్రూపు వంతుగా రూ.1,96,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అవయవదానంతో పునర్జన్మ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ధర్మవరం రూరల్: అవయవదానం చేయడం పునర్జన్మను ప్రసాదించడమేనని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని రిషి పాఠశాలలో బుధవారం ప్రపంచ అవయవదాన దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవదాన ప్రాముఖ్యత వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ కరణ్ స్వరూపాసింగ్, డీన్ భాస్కర్‌రెడ్డి అవయవదానం ఆవశ్యకత గురించి వివరించారు. సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రాగానిపల్లి తండాకు వెళ్లే బండి బాట


అధ్వానంగా తయారైన చౌటకుంటపల్లి రోడ్డు


గుంతలతో అస్తవ్యస్తంగా మారిన చెరువువాండ్లపల్లి రహదారి

పల్లె దారులు ఛిద్రం

- అడుగడుగునా గుంతలమయం
- రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నల్లమాడ: గ్రామీణ రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. మరమ్మతులు కానీ.. కొత్తగా రోడ్ల నిర్మాణాల గురించి పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మండల పరిధిలోని నల్లమాడ – రెడ్డిపల్లి ప్రధాన రహదారితో పాటు చౌటకుంటపల్లి, చెరువువాండ్లపల్లి, కుటాలపల్లి, కొండకింద తండా, ఎన్.ఎనుములవారిపల్లి తదితర గ్రామాల రోడ్లు అడుగుకో గుంత ఏర్పడ్డాయి. కంకర తేలి అధ్వానంగా మారాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ‘పల్లె పండుగ’ పేరిట ప్రతి గ్రామానికీ రోడ్లు వేస్తామని, సాఫీగా ప్రయాణం సాగేలా తీర్చిదిద్దుతామని ప్రచారం చేసింది. అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి అక్కడక్కడా రోడ్లకు ప్యాచ్ వర్కులు చేసి బిల్లులు చేసుకున్నారు. కానీ పూర్తిస్థాయిలో గ్రామీణ రోడ్లపై దృష్టి సారించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రోడ్డు లేని రాగానిపల్లి తండా

మండల కేంద్రం నల్లమాడకు కూతవేటు దూరంలో రాగానిపల్లి తండా ఉంది. 40 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. బస్సు సౌకర్యం కోసం తండావాసులు మూడు కిలోమీటర్లు కాలిబాటన నడిచి నల్లమాడ ► కదిరి ప్రధాన రహదారిలోని రాగానిపల్లి బస్టాప్‌కు చేరుకోవాలి. రైతులు ఎరువులు, మందులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వృద్ధులు, వికలాంగుల బాధలు చెప్పనవసరం లేదు. రాగానిపల్లి మీదుగా తండా వరకు తారురోడ్డు నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు మొదలు కాలేదు.

► నల్లమాడ – కొండకమర్ల రహదారిలోని చౌటకుంటపల్లిలో 300 కుటుంబాలు ఉన్నాయి. గతంలో నల్లమాడ నుంచి చౌటకుంటపల్లి మీదుగా కదిరికి బస్సులు నడిచేవి. అయితే రోడ్డుపై తారు పోయి కంకర తేలడంతో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ అధికారులు ఆ మార్గంలో వెళ్లే బస్సు సర్వీసులను ఎద్దులవాండ్లపల్లి తండా మీదుగా మళ్లించారు. దీంతో రవాణా సౌకర్యం లేక చౌటకుంటపల్లి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

బస్సులు నడపాలి



రోడ్డు మరమ్మతు చేయించి చౌటకుంటపల్లి మీదుగా బస్సులు నడపాలి. బస్సు ఎక్కాలంటే రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఎద్దులవాండ్లపల్లి తండా వద్దకు వెళ్లాల్సి వస్తోంది. తిరుగు ప్రయాణంలో అక్కడ దిగి కాలినడకన గ్రామానికి చేరుకోవాలి. వ్యవసాయ పరికరాలు, ఏవైనా వస్తువులు తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– నాగభూషణరెడ్డి, చౌటకుంటపల్లి

రోడ్డు రిపేరీ చేయాలి



చెరువువాండ్లపల్లి నుంచి మండల కేంద్రం నల్లమాడకు బస్సు సౌకర్యం లేదు. దీంతో అక్కడకు చేరుకోవాలంటే మూడు కిలో మీటర్లు నడిచి వెళ్లాలి. రోడ్డు మొత్తం గుంతలు పడి కంకర తేలి నడవడానికి సైతం ఇబ్బందిగా ఉంది. చీకటి పడితే గ్రామానికి వెళ్లాలంటే నరకమే. అధికారులు స్పందించి రోడ్డు రిపేరీ చేయించాలి.

– కోనపల్లి నరసింహారెడ్డి, చెరువువాండ్లపల్లి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోనున్న బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 20న అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలెక్షన్లలో ప్రతిభ చూపిన బాల బాలికలు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 14 నుంచి 17 వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే 8వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో బాలికల జట్టులో ధర్మవరానికి చెందిన జి.కిరణ్మయి, బి.నిఖ్యశ్రీ, ఎం.యశస్విని, కె.అంజన, బాలుర జట్టులో టి.విజయ్ తరుణ్, ఆర్.లక్ష్మీనరసింహ ఎంపికయ్యారని తెలిపారు. పట్టణం నుంచి ఏకంగా ఆరుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం హర్షణీయమని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేంద్ర పేర్కొన్నారు.

అడ్డగోలు నిర్ణయాలతో విద్యారంగం అస్తవ్యస్తం


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలు విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మారుస్తున్నాయని యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో వారు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో జూలై 11 నుంచి నిర్వహిస్తున్న ఎఫ్ఏ1 పరీక్షలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ ఒకటైతే ప్రశ్నపత్రాల్లో మరోక సిలబస్ ఉందని పేర్కొన్నారు. ఒకటవ తరగతి విద్యార్థికి ఏప్రిల్‌లో నేర్చుకోబోయే సిలబస్‌లోని ప్రశ్నలు ఆగస్టులో జరిగే ఎఫ్ఏ1 పరీక్షలో ఇవ్వడం దారుణమన్నారు. మూడో తరగతి పరీక్షలో విద్యార్థి తెలుగులో పుస్తక సమీక్ష చేసి ఆ సమీక్షను సమర్పణ చేయాలనడం ఎంతవరకు సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారుల ఆలోచించి ముల్యాంకన పుస్తకాల్లో ఉన్న అసంబద్ధాలను సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్,శ్రీనివాసులు, తాహిర్‌వలి, మల్లికార్జున సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు అంధకారం



డ్రగ్స్ అనర్థాలను వివరిస్తున్న పోలీసులు, బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు అంధకారం అవుతాయని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ గోపీనాథ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పుట్టపర్తిలో చిన్నపల్లివద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ‘డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన’ కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ నివారణలో భాగంగా ఈగల్ క్లబ్స్, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972పై అవగాహన కల్పించి విద్యార్థులతో నేస్తా ముక్తా భారత్ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శక్తి యాప్, బాల్య వివాహాలు, పోక్సో చట్టాలు, మహిళా చట్టాల గురించి వివరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోవాల్సి వస్తుందని, విద్యార్థి దశ నుంచే ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మాదవ ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గంగాధర్, శక్తి టీం సభ్యులు ధర్మదేవ్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

ఓడీచెరువు : ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అల్లాపల్లి సచివాలయ మహిళా పోలీస్ ఎస్.పర్వీన్ పిలుపునిచ్చారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గౌనిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నాసా ముక్త్ భారత్‌అభియాన్‌కార్యక్రమంలో భాగంగా టోల్‌ఫ్రీ నంబర్ 1972 తోపాటు బాల్యవివాహాల నిరోధక హెల్ప్ లైన్ 1098, సైబర్ క్రైమ్ 1930 నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని హెచ్ఎం తెలిపారు. అనంతరం డ్రగ్ రహిత సమాజాన్ని స్థాపిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పుట్టపర్తి టౌన్: డ్రగ్స్ వాడకం వలన జీవితాలు అంధకారం అవుతాయని గోరంట్ల సీఐ శేఖర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం గోరంట్ల సమీపంలో ఉన్న బెస్ట్ యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వల్ల కగిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, డ్రగ్స్ నివారణలో భాగంగా ఈగల్ క్లబ్స్, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి వివరించి విద్యార్థులతో నషా ముక్తా భారత్ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ అనురాధ, డిప్యూటీ రిజిస్ట్రార్ జై ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు


ఎన్ఎస్ గేట్‌లో బందోబస్తు చేపట్టిన పోలీసులు

చెన్నేకొత్తపల్లి: రామగిరి మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఉప ఎన్నిక నేపథ్యంలో బుధవారం పోలీసులు బందోబస్తు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ నుంచి రామగిరి వైపునకు వెళ్లే దారిలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపారు. చివరికి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన


ధర్మవరం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ధర్మవరం అర్బన్/ పుట్టపర్తి టౌన్/ కదిరిటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. ధర్మవరం డిపో వద్ద నిర్వహించిన ధర్నాలో ఎన్ఎంయూ జిల్లా నాయకులు మోహన్, దుర్గాప్రసాద్, నాగప్ప మాట్లాడుతూ పీఆర్సీ ఏర్పాటు చేసి, తక్షణమే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 8వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఎన్ఎంయూ నాయకులు హనుమాన్, మంజు, రమణప్ప, వైవీఎస్ రెడ్డి, భాస్కర్, కుమార్, హరి, పీఎస్ ఖాన్, ఎంసీజీ రావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తి డిపో ఎదుట ఎన్ఎంయూ నాయకులు గేట్ మీట్ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు శివశంకర,డిపో కమిటీ సలహాదారు అప్పిరెడ్డి,సీనియర్ నాయకులు గయాజ్‌బాషా, డిపో కార్యదర్శి గంగులయ్య, గ్యారేజ్ అధ్యక్షులు ఈశ్వరయ్య, కార్యదర్శి నూర్‌మహమ్మద్, డిపో వైస్ ప్రెసిడెంట్ సీఎస్ఎన్ రావ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ రాజగోపాల్, డిపో ట్రెజరర్ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా వాణిజ్యం.. వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం


ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్యం కోసం కేంద్రం ఒప్పందం చేసుకుని, షరతులకు అంగీకరిస్తే మన దేశ వ్యవసాయరంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. ఈ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ బుధవారం పుట్టపర్తిలో బైక్‌ర్యాలీ నిర్వహించి ఒప్పంద జీఓలను దహనం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అమెరికాతో ఒప్పంద షరతులకు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకొనే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. పత్తి సోయాబీన్స్, జనుము మార్పిడి పంటలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. మనం మిగులులో ఉన్న పాల ఉత్పత్తులనూ దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఇవన్నీ సుంకాలు లేకుండా దిగుమతి వచ్చి పడితే మన రైతాంగం పంటలు అమ్ముకొనే అవకాశం లేక దివాళా తీసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ప్రవీన్, వెంకటేషులు, గంగాద్రి, సిద్ధూ, నాగరాజు పాల్గొన్నారు.

టంప్ దిష్టిబొమ్మ దహనం

తనకల్లు: అమెరికా సుంకాలు పెంచడం వల్ల ఆక్వారంగంపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జాతీయరహదారి–42పై దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎగుమతి సుంకాన్ని 50 శాతానికి పెంచడం దారుణమన్నారు. దీంతో కొందరు వ్యాపారులు సుంకాలను సాకుగా చూపి రొయ్యలను తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతుల కడుపు కొడుతున్నారని తెలిపారు. ఒకే దేశంపై ఆధారపడడం తగ్గించి, ఎగుమతులను విస్తృతంగా పెంచుకోడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు చౌడప్పయాదవ్, ఏపీ రైతు సంఘం నాయకులు శివన్న, రెడ్డెప్ప, వెంకటేషు, శ్రీనివాసులు. రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని పునరుద్ధరించడమే లక్ష్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని పునరుద్ధరించడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగ ర్యాలీలో భాగంగా బుధవారం పుట్టపర్తిలో మున్సిపల్ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్, విద్యాగిరి ఆర్చ్ వరకు ర్యాలీ సాగింది. కమిషనర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకొని, వారి త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు.

కదిరి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓబుళేశ్వర అకాడమీ విద్యార్థులు, బీజేపీ నాయకులు బుధవారం కదిరిలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నెలకొల్పాలన్న ప్రధాని మోదీ ఆశయమే ‘హర్ ఘర్ తిరంగా’ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపి నాయకులు మిట్టా వంశీకృష్ణ, గంగాధర్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే గేటు మరమ్మతులు వాయిదా

ముదిగుబ్బ: గుంజేపల్లి సమీపంలోని కృష్ణాపురం రైల్వే గేటు మరమ్మతు పనులను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాహన రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గేటు మీదుగా వెళ్లవచ్చని పేర్కొన్నారు.

చేపల పెంపకానికి రేపు వేలం

నల్లచెరువు: పంతుల చెరువు సర్పంచ్ వై.స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం పంతులచెరువు, ఇందుకూరి పల్లిలోని కొత్తకుంట చెరువులను చేపల పెంపకం కోసం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజునాయక్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పంతుల చెరువులో నిర్వహించే వేలంలో పాల్గొనేవారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని మోత్కుపల్లి మెయిన్ రోడ్డులో 11 కేవీ లైన్ లాగుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. మోత్కుపల్లి మెయిన్ రోడ్డు, తిరుమల లేఔట్, శ్రీనివాస ఐటీఐ కాలేజీ ఏరియా, డ్వాక్రా కాలనీ, మార్కండేయనగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ లక్ష్మీదేవి

నల్లచెరువు: మండల కేంద్రంలోని నూరుద్దీన్ కాలనీలో మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి బుధవారం ఓ ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలో నివాసముంటున్న సుబహాన్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే బుధవారం ఉదయం కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అయితే అప్పటికే ఇల్లు కూలిపోయింది. వర్షాలకు నెమ్ముతీసుకుని పైకప్పు కూలిందని కంటతడి పెట్టాడు. ఆర్ఐ లక్ష్మీదేవి రెవెన్యూ సిబ్బందితో కలిసి కూలిన ఇంటిని పరిశీలించారు.

ఉజ్జినప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవం


గ్రామస్తులతో కలసి స్వాములను దర్శించుకున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

కనగానపల్లి: ముత్యవకుంట్ల గ్రామంలో బుధవారం ఉజ్జినప్ప స్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో మంగళవారం రాత్రి నుంచి వేదపండితులతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేకువజామున 5:30 గంటలకు ఆలయ ప్రవేశం చేసి స్వామిని ప్రతిష్టించారు. అనంతరం వందలాది మంది భక్తులు ఉజ్జినప్ప స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ గోరంట్ల మాధవ్ ఆలయ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామిని మాధవ్ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అతకల్ల పట్నం పెదయ్యస్వామితో పాటు పలు గుడికట్ల దేవర్లకు పూజలు చేయించారు.

పంటల నమోదు తప్పనిసరి


సూచనలిస్తున్న అధికారులు

తనకల్లు: రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పక నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి భారతి తెలిపారు. పరాకువాండ్లపల్లిలో బుధవారం ‘పొలం పిలుస్తోంది’ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. వేరుశనగ పంటలో పూత దశలో నాలుగు బస్తాలు జిప్సం వేయడం వల్ల అధిక దిగుబడి పొందడమే కాకుండా గింజలో నూనె శాతం పెరుగుతుందన్నారు. క్రిమి సంహారక మందుల పిచికారీ కోసం ప్రభుత్వం కిసాన్ డ్రోన్లను 80 శాతం రాయితీపై అందజేస్తోందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఐదుగురు కలిసి గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ డబ్బులు అందని వారు రైతు సేవ కేంద్రంలో ఫిర్యాదును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు


పోలీసుస్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్

తాడిమర్రి: చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. నాయనపల్లి సమీపంలోని చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో బుధవారం ఆయన రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తనిఖీలు చేశారు. ఇసుకను నింపుకుని వెళుతున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, పోలీసుస్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని నాయనపల్లి, దాడితోట, చిన్నచిగుళ్లరేవు గ్రామాల సమీపంలోని చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండవసారి కూడా ఇసుక తరలిస్తూ పట్టుబడే ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు.